క్లుప్తంగా

సందడిగా ధనమ్మ మర్రి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలోని ధనమ్మ మర్రి పరిసరాలు ఆదివారం సందడిగా మారాయి. సెలవు కావడంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కలియ తిరుగుతూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంతో పాటు రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, అంబాజీపేట, కొత్తపేట తదితర మండలాల నుంచి పర్యాటకులు క్షేత్రాన్ని సందర్శించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



ప్రేమ జంట సమక్షంలో వారి బంధువులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

రాయవరం: ఓ ప్రేమ జంట ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది. రాయవరంలోని వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన మేజర్లు వివాహం చేసుకున్న అనంతరం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్సై పి.బుజ్జిబాబును కోరారు. దీంతో ప్రేమజంటకు చెందిన ఇరుపక్షాల కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువురు మేజర్లు అయినందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని కుటుంబ సభ్యులకు సూచించారు. వారి నుంచి హామీ పత్రాలు తీసుకుని పంపించారు. దీంతో ప్రేమ జంట కథ సుఖాంతమైంది.

మండపేటలో నటుడు శ్రీకాంత్ సందడి



శ్రీకాంత్‌తో సెల్ఫీలు తీసుకుంటున్న అభిమానులు

మండపేట: 'పెళ్లిసందడి' చిత్రంలో హీరోగా నటించిన శ్రీకాంత్ మండపేటలో ఆదివారం జరిగిన ఓ వివాహంలో సందడి చేశారు. కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి వీరవెంకట సత్యప్రసాద్ కుమార్తె వివాహాన్ని మండపేటలో బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ వివాహానికి హీరో శ్రీకాంత్ హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా విచ్చేసి వధూవరులు అషిత, అఖిల్‌లకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. శ్రీకాంత్ రాకతో ఈ వివాహంలో మరింత కోలాహలం నెలకొంది. ఆయనతో పెళ్లికి వచ్చిన యువకులు, పెద్దలు కూడా సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపించారు. అలాగే నూతన వధూవరులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా ఆశీర్వదించారు.

సినిమాలు



రామచంద్రపురం

రాజగోపాల్	:	శ్వాగ్
కిషోర్	:	దక్షిణ
శ్రీసూర్య	:	దేవర

ద్రాక్షారామ

శ్రీలక్ష్మి	:	సత్యం సుందరం
శ్రీసూర్య	:	దేవర

మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

రబీకి అన్నదాత సన్నద్ధం

- నారుమడులు సిద్ధం చేసే పనిలో రైతుల నిమగ్నం
- అధిక శాతం విస్తీర్ణంలో వెదజల్లు

రామచంద్రపురం: తొలకరి పంటను ఒబ్బిడి చేసుకుంటూనే దాళ్వా సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కోతలు పూర్తయిన చోట ఇంజిన్లపై నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల మండలాల్లోని సుమారుగా ఒక లక్షా 3 వేల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేశారు. పంట చివరి దశలో అల్పపీడనం ఆందోళన గురి చేసిన వాతావరణం అనుకూలించడంతో రైతాంగం ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే సుమారు 90 శాతం మేర తొలకరి మాసూళ్లు పూర్తయినట్టు అంచనా. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో చేసేది లేక రైతులు దళారులకే అయినకాడికి అమ్ముకుంటున్నారు. రబీ నాట్లు వేసే దశ రావటంతో రైతులు రబీ నాట్లు వేసేందుకు సమాయత్తమవుతునారు. పూర్తి స్థాయిలో మరో వారం పది రోజుల్లో మాసూళ్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా కోతలు పూర్తయిన పొలాల్లో రైతులు రబీ సాగుకు నారుమడులు, వెదజల్లేందుకు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. త్వరగా నాట్లు వేయడం ద్వారా పంట చివర్లో నీటి ఎద్దడిని అధిగమించవచ్చని రైతులు భావిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గంల్లో సుమారు ఒక లక్ష, మూడు వేల ఎకరాల్లో రబీ సాగు జరగనుంది. గతంతో పోలిస్తే ఈసారి వెదజల్లు విధానానికి రైతులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. రామచంద్రపురం అర్బన్, రూరల్‌లో సుమారు 22 వేల ఎకరాలకు గాను గత ఏడాది సుమారు 15 వేల ఎకరాల్లో వెదజల్లు సాగు చేయగా ఈ సారి 20 వేల ఎకరాల వరకు వెదజల్లు పద్ధతిలో రైతులు సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కేరళ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో బొండాలు రకం ధాన్యానికి గత నాలుగేళ్లుగా ధర మద్దతు ధర కూడా అందక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించి ప్రత్యామ్నాయ వంగడాలు పండించే దిశగా వ్యవసాయశాఖ రైతులను చైతన్యపరుస్తోంది. బొండాలు సాగు కాలం 135 రోజులు కాగా కేవలం 120 నుంచి 125 రోజుల్లో 50 నుంచి 60 బస్తాల దిగుబడినిచ్చే స్వర్ణ రకాలైన శ్రీధృతి (ఎంటీయూ 1121), తరంగిణి (1156), ఎంటీయూ 1153 తదితర రకాల సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తొలకరిలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాకు మంగళం పాడినా రైతులు కష్ట, నష్టాలతో తొలకరి సాగును పూర్తి చేశారు. కాగా రబీ సీజన్ నాటికైనా రైతు భరోసాను ప్రభుత్వం వేస్తుందని రైతులు ఆశతో రబీ పనులకు సన్నద్ధమవుతన్నారు.



రామచంద్రపురం వద్ద వెదజల్లేందుకు సిద్ధం చేసిన వరి చేను

ప్రత్యామ్నాయ రకాలు సాగు చేయాలి



దేశవ్యాప్తంగా కేవలం కేరళ మార్కెట్‌లో మాత్రమే ఎంటీయూ 3626 (బొండాలు) రకం కొనుగోళ్లు జరుగుతాయి. గతంలో మాదిరి కేరళ మార్కెట్ లేక బొండాలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ రకాలు సాగుచేయాలని రైతులకు వివరిస్తున్నాం. తక్కువ సాగుకాలంలో ఎక్కువ దిగుబడులనిచ్చే శ్రీధృతి (ఎంటీయూ 1121), తరంగిణి (1156), ఎంటీయూ 1153 తదితర రకాల సాగు చేయాలని సూచిస్తున్నాం.

– సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం

ప్రభుత్వ సాయం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఏ మాత్రం సాయం లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో పాటుగా రైతు భరోసాతో సీజన్‌కు ముందే రూ.7500 ఎకరానికి రైతుల బ్యాంకు ఖాతాల్లో వేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎటువంటి ఆసరా లేకుండా పోయింది. అయినప్పటికి రెండో పంట వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నాం.

– గుణ్ణం రామకృష్ణ, రైతు, కొత్తూరు

13న మండపేటలో జనార్దన స్వామి తెప్పోత్సవం

మండపేట: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి వారి తెప్పోత్సవం, అఖండ దీపారాధనను క్షీరాబ్ది ద్వాదశి నాడైన ఈ నెల 13న నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కామేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాన్ని బురుగుంట చెరువు పార్కులో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందుకోసం పంటు, లైటింగ్ వంటి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, ఆనం రాంనారాయణరెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు.

'కామన'కు కేంద్ర మాజీ మంత్రి పరామర్శ

మండపేట: ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావును కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు ఆదివారం పరామర్శించారు. మండలంలోని ఏడిదలో నివాసం ఉంటున్న ప్రభాకరరావు ఇటీవల గుండెపోటు వచ్చింది. హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని ఏడిదలోని తన నివాసానికి తిరిగి వచ్చారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కామనను పళ్లంరాజుతో పాటు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజులు ఆదివారం పరామర్శించారు. వారి వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు శివకోటి శేష సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

చంద్రుడు ప్రతిష్ఠించిన కోరుమిల్లి సోమేశ్వరాలయం

కపిలేశ్వరపురం: మండలంలో కొలువైన శివాలయాలకు ప్రత్యేక స్థానముంది. చంద్రుడు ప్రతిష్ఠించిన అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగో ఆలయంగా కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. కార్తిక మాసం కావడంతో సోమవారం ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సూర్య ప్రతిష్ఠితమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయం చుట్టూ చంద్రుడు ఎనిమిది దిక్కుల్లో ఎనిమిది ఆలయాలను ప్రతిష్ఠించాడని ప్రతీతి. అందులో ద్రాక్షారామ ఆలయానికి నైరుతి దిక్కున కోరుమిల్లిలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి కొలువై ఉన్నాడు. మిగిలిన దిక్కుల్లో కోటిపల్లి, వెంటూరు, కోలంక, సోమేశ్వరం, వెల్ల, పెనుమళ్ల, దంగేరులలో ఉన్నాయి. కోరుమిల్లిలోని స్వామి ఆలయం చంద్ర ప్రతిష్ఠాలయం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి అభిషేకం చేసుకునేందుకు భక్తులు తరలి వస్తుంటారు. శివరాత్రికి తెల్లవారుజామునే రుద్రాభిషేకం చేసిన అనంతరం స్వామి దర్శనానికి అనుమతిస్తారు. పూర్వాషాడ నక్షత్రాన జన్మించిన వారు స్వామిని దర్శించుకోవడం ద్వారా సుఖ శాంతులతో జీవనం సాగుతుందని భక్తుల నమ్మకం. కార్తిక మాసంలో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. పడమర ఖండ్రికలో ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంగా వర్ధిల్లుతున్న అన్నపూర్ణాదేవి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయం వద్ద దీపాలంకరణ, తీర్థాలను వైభవంగా నిర్వహిస్తారు. కపిలేశ్వరపురంలోని శ్రీపాపవినాసేశ్వర, అగస్త్యేశ్వరస్వామి, అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, తాతపూడిలోని శ్రీమల్లేశ్వర స్వామి, మాచరలోని ఉమా రాజలింగేశ్వరస్వామి, నేలటూరులోని బసవలింగేశ్వరస్వామి, వాకతిప్ప, వల్లూరు,టేకి గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక పూజలు వైభవంగా సాగుతున్నాయి.



కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి

ఘనంగా అఖండ నామసంకీర్తన

కె.గంగవరం: మండలంలోని దంగేరు జోన్ పరిధిలోని సత్యసాయి సేవా సమితులు, భజన మండళ్ల సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ వ్యాప్త సత్యసాయి అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవళ్ల సత్యవతి ఇంటి వద్ద నిర్వహించిన ఈ నామ సంకీర్తనలో 21 గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు అడపా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 172 దేశాల్లో ప్రపంచ శాంతి కొరకు ఒకే సమయంలో శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దంగేరు జోన్ కన్వీనర్ నారాయణరావు, కృష్ణమూర్తి, నున్న నరసింహమూర్తి, వల్లూరు రామారావు, తము మాధవ్, బ్రహ్మాజీ, అక్కిరాజు శ్రీనివాసు, సభ్యులు పాల్గొన్నారు.



నామ సంకీర్తనలో పాల్గొన్న సత్యసాయి సేవా సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు

పౌష్టికాహారంతో సమతుల్యతను కాపాడుకోవాలి



గర్భిణికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

కాజులూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆహార సమతుల్యతను కాపాడుకుని సుఖప్రసవంతో పాటు ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వగలుగుతారని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లపాలెం పీహెచ్‌సీలో గ్రామానికి చెందిన లీలాకళ్యాణి సాధన క్లబ్ అధ్యక్షురాలు సలాది పుష్పవతి ఆధ్వర్యంలో అలయన్స్ క్లబ్ సభ్యులు గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులు డాక్టర్ల సూచనల మేరకూ వ్యాయామం చేయడంతో పాటు పోషక విలువలు అధికంగా ఉండే గుడ్లు, మునగాకు, తోటకూర వంటివి ప్రతి రోజు ఆహారంలో తీసుకోవాలని క్రమం తప్పకుండా ప్రతి నెలా ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్స్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాస్, క్లబ్ సభ్యులు ఈలి లక్ష్మి, నున్న వెంకటేశ్వరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌజన్య, ఎంపీహెచ్‌ఈఓ వైకుంఠరావు, శ్యాములేసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారులు

కె.గంగవరం: మండలంలోని యర్రపోతవరం, కూళ్ల మల్లవరంలో రహదారులు ప్రమాదకరంగా మారాయి. అధికారులు వెంటనే స్పందించకపోతే ప్రమాదాలు తప్పవని స్థానికులు వాపోతున్నారు. యర్రపోతవరం–యానం రహదారిలో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పక్కనే పంటకాలువ ఉండడం వల్ల రహదారి కోతకు గురైందని స్థానికులు చెబుతున్నారు. కోతకు గురైన చోట కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో రోడ్డు గమనించక వాహనదారులు ప్రమాదాలు బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారని అంటున్నారు. గత నాలుగు రోజులుగా ప్రతి రోజు రాత్రి వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులు వెంటనే స్పందించి కనీసం తాత్కాలిక చర్యలైన చేపట్టాని ప్రయాణికులు కోరుతున్నారు. మరోవైపు కూళ్ల మల్లవరం వద్ద ఏటిగట్టుకు ఆనుకుని నరజాడ వెళ్లే రహదారి గోతుల మయంగా ఉండి బురదగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకుని బెర్మ్ కూడా లేకపోడం వల్ల వాహనాలు పల్టీలు కొడుతున్నాయని, మరోవైపు వంతెనకు ఇరువైపులా ఉన్న రహదారి బాగోలేదని వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



యర్రపోతవరం–యానం రహదారిలో కోతకు గురైన రహదారి



కూళ్ల మల్లవరం వద్ద ప్రమాదకరంగా మారిన రహదారి

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రాయవరంలో అయ్యప్పల పడిపూజ

రాయవరం: అయ్యప్ప స్వామి పడిపూజను శనివారం రాత్రి రాయవరంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక చాణక్య ఆస్పత్రి సమీపంలో అయ్యప్పలు యాళ్ల జోగయ్య, పవన్ స్వాములు ఈ వేడుక నిర్వహించారు. పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్) గురుస్వామి నేతృత్వంలో శాస్త్రోక్తంగా పడి పూజ నిర్వహించారు. పడిపూజకు ముందుగా స్వామివారికి అష్టోత్తర పూజ, అయ్యప్ప భజన సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా పడి పాటకు అనుగుణంగా అయ్యప్పలు చేసిన పడి పూజ భక్తులను ఆకట్టుకుంది. రాయవరం పరిసర గ్రామాల అయ్యప్పలు ఈ పడిపూజలో పాల్గొన్నారు.

పీఠంలో నేడు లక్ష బిల్వార్చన


రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో సోమవారం లక్ష బిల్వార్చన న్విహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్టేటర్ వీవీ బాపిరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళార్చనలు విజయదుర్గా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు, భవానీ సమేత అష్టమ లింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన చేస్తారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా పీఠంలో విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహిస్తామన్నారు.

పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: విద్యార్థుల ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే వీలు కల్పిస్తూ పాఠశాలల్లో సోమవారం నుంచి ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే విషయంలో విద్యార్థుల అవస్థలను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాలపై పాఠశాలల్లోనే నవీకరణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ తాతారావు తెలిపారు.

పిక్‌నిక్ స్పాట్

గొల్లపాలెం వాటర్‌ట్యాంక్‌కు వనభోజనాల తాకిడి



గొల్లపాలెంలో వాటర్ ట్యాంక్ వెనుక ఉన్న వనభోజనాల మామిడితోట

కాజులూరు: కార్తికమాసంలో కాజులూరు మండలం గొల్లపాలెం వాటర్‌ట్యాంక్ (భారీ రక్షిత మంచినీటి పథకం)కు వనభోనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆహ్లాదకరమైన వాటర్‌ట్యాంక్, దానిని ఆనుకుని విశాలమైన మామిడితోట, తోటలో పచ్చికబయళ్లను తలపించే చదునైన స్థలం వనభోజనాలకు అనువుగా ఉండటంతో ఇటీవల ఇక్కడ కార్తికమాసం పురస్కరించుకుని ఆదివారం, సోమవారాల్లో వనభోజనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ రద్దీ ఎక్కువైనప్పుడు సమీపాన గుండారం మామిడి తోటల్లోనూ సందర్శకులు వనభోజనాలు గావిస్తున్నారు. గొల్లపాలెం పరిసరాల్లో ఉన్న కాజులూరు, కరప మండల గ్రామాలతో పాటు రామచంద్రపురం, కాకినాడ పట్టణాల నుంచి సందర్శకులు ఇక్కడకు వచ్చి వనభోజనాలు చేస్తున్నారు. గత కొన్నాళ్ల క్రితం స్థానికులు ఈ తోటల్లో ఉసిరి చెట్టు నాటడంతో పూజలు నిర్వహించుకునేందుకు భక్తులు అధికంగా వస్తున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని వాటర్‌ట్యాంక్ ఉండగా దాని వెనుక భాగంలో వనభోజనాల మామిడితోటలు ఉన్నాయి. కాకినాడ, రామచంద్రపురంల నుంచి 15 కిలో మీటర్లు ప్రయాణిస్తే ఈ పిక్‌నిక్ స్పాట్‌ను చేరుకోవచ్చు. నిత్యం ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఈ రహదారిలో తిరుగుతూనే ఉంటాయి.

బియ్యంపేట వాసులకు తీరిన సమస్య



ద్రాక్షారామ బియ్యంపేటలో కొత్తగా వేసిన విద్యుత్ స్తంభం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ బియ్యంపేటలో నివాసం ఉండే వారు చాలా కాలంగా విద్యుత్ స్తంభం వీధి రోడ్డుకు మధ్యలో ఉండే సమస్యతో ఇబ్బంది పడుతూ ఉండేవారు. దీనిపై 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని రోడ్డుకు పక్కకు జరిపి ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి' పత్రికకు, విద్యుత్ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.